క్లుప్తంగా

నిప్పులవాగుకు 600 క్యూసెక్కుల నీరు



లాకీన్స్‌లా నుంచి నిప్పులవాగుకు విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకీన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు కేసీ కెనాల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నగేష్ తెలిపారు. సుంకేసుల నుంచి 2,100 క్యూసెక్కుల నీరు వస్తోందని, కాగా లాకీన్స్‌లా నుంచి నిప్పులవాగుతోపాటు తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు 250 క్యూసెక్కులు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 10 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నట్లు వివరించారు.

బెల్లం ఊట ధ్వంసం



నీలిషికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న టౌన్ ఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణ పరిధిలోని నీలిషికారిపేటలో దాడులు నిర్వహించి నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను టౌన్ ఎస్‌ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. నీలిషికారి విజయ్ ఇంటి వద్ద 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. షికారి విజయ్ పరారయ్యారు.

ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎ.రణధీర్

ఆత్మకూరు: కార్పొరేట్ కంపెనీల దోపిడీని అడ్డుకునేందుకు, సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం కార్యదర్శి ఎ.రణధీర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సుదర్శనవర్మ భవన్‌లో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆయన ఆట్లాడుతూ అదనపు లాభాల కోసం బడా సంస్థలు రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాన్ని సాధనాలుగా మార్చుకున్నాయన్నారు. సామాన్యులకు వసతి గగనంగా మారిందన్నారు. మురికివాడలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలన సాగించాలని చెప్పారు. పార్టీ పట్టణ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, గణపతి, చిన్న, అంబయ్య, సామేలు, రవి, ప్రతాప్, మల్లేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పల్లకోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామి అమ్మవార్లకు పల్లకోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మూలా నక్షత్రం రోజుల్లో (సర్కారి సేవగా) జరిపిస్తారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పం పఠించారు.కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు గావించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేపట్టారు.

చంద్రబాబుకు యువత గుణపాఠం చెప్పాలి

నందికొట్కూరు: మెడికల్ విద్యను మాఫియాగా మారుస్తున్న చంద్రబాబుకు యువత గుణపాఠం చెప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యా సంస్థలకు ధారాదత్తం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, కార్యదర్శి ఆది, నాయకులు జగదీష్, శ్యామ్ నాయక్, సూరిగణేష్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రణభేరి జాతా జయప్రదంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని, ఇది పేద విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుందన్నారు.



దెబ్బతిన్న నందికుంట-ఆత్మకూరు రోడ్డు.



నందికుంట గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న రహదారి.



రోడ్డుపై నిలిచిన వర్షం నీటిలోనే అంగన్‌వాడీ చిన్నారులను తీసుకెళ్తున్న నందికుంట గ్రామస్తులు

రోడ్లన్నీ చిందరవందర!

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- అడుగడుగునా గుంతలే
- వాహనదారులకు ప్రయాణం ప్రాణసంకటంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: ఇటీవల కురిసన అధిక వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ చిందరవందరగా తయారయ్యాయి. ఏరోడ్డుపై వెళ్లాలన్నా అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్లపై వాహనదారులకు ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు అధికారులు అనునిత్యం ఈ రోడ్లపై తిరుగుతున్నారే తప్ప వాటిని బాగుచేయిద్దాం అన్న ఆలోచన కనపడకపోవడం ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

ప్రయాణం నరకప్రాయం..

ఆత్మకూరు పట్టణం నుంచి నందికుంట గ్రామానికి నాలుగు కిలోమీటర్లు ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఆత్మకూరు పట్టణం నుంచి దుద్యాల మీదుగా కొక్కెరంచ గ్రామానికి 15 కిలో మీటర్ల దూరాన్ని పడుతూ లేస్తూ వాహదారులు, ప్రయాణం సాగిస్తున్నారు. నందికుంట నుంచి కొత్తపల్లి మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరాన్ని చేరుకోవాలంటే అతులు, గతుల రోడ్డే గతి అయిందని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి శివపురం గ్రామం వరకు ఎక్కడ చూసినా మోకాలిలోతు గుంతలే రోడ్డు వెంట దర్శమిస్తున్నాయి. ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం 45 కిలోమీటర్లు, కొలనుభారతిదేవి ఆలయం 25 కిలో మీటర్లు ఉన్నా ఆ దూరాన్ని భక్తులు అధిగమించాలంటే ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం గ్రామాలకు సైతం సురక్షితమైన ప్రయాణం కోసం రోడ్లు వేస్తున్నామని ప్రకటనలకే పరిమితం అయిందని, ఈ ప్రభుత్వానికి ఈ రోడ్లు కనపడడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేయకుంటే ప్రయాణికులు, వాహనచోదకులు ప్రమాదాలకు గురికాక తప్పదు.



ఆత్మకూరు-దుద్యాల గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు



శివపురం సమీపంలో ఎద్దులేరు వాగువద్ద రాళ్లు బయట పడ్డ దృశ్యం

ఆత్మకూరులో 11.8 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. 11.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వీడని వర్షం కారణంగా మొక్కజొన్న, వరి తదితర పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

పాములపాడు: మండలంలో సోమవారం నుంచి పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి భాస్కర్ ఆదివారం తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం కింద 4 నెలలు దాటిన ప్రతి పశువుకు గాలి కుంటు టీకాలు తప్పనిసరి వేయించాలన్నారు. అక్టోబర్ 15వ తేదీ వరకు టీకాలు వేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మారుతినగర్ సమస్యలపై నేడు ధర్నా

నందికొట్కూరు: ఈ నెల 15వ తేదీన రెవెన్యూ కార్యాలయం ఎదుట మారుతినగర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఎం నాయకులు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతినగర్ కాలనీ ఏర్పడి 30 ఏళ్లు గడిచినా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కనీసం రోడ్లు, విద్యుత్, మంచినీళ్ల సరఫరా కూడా చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, కాలనీ ప్రజలు కమల్‌సాహెబ్, హుసేన్, నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌తో భద్రతకు భరోసా

- డ్రైవింగ్ లైసెన్స్‌తో ఎన్నో ఉపయోగాలు
- ఇంటి నుంచే ఎల్‌ఎల్‌ఆర్ దరఖాస్తుకు అవకాశం
- లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే శిక్షతో పాటు జరిమానా
- బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఏవీ సత్యనారాయణరెడ్డి

నిర్లక్ష్యం వద్దు



సొంత వాహనాల్లో వెళ్లాలనుకునేవారు. డ్రైవింగ్ నేర్చుకుంటునప్పటికీ లైసెన్స్ తీసుకునే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి. డ్రైవింగ్‌లో పూర్తిస్థాయి శిక్షణ తీసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని స్లాట్ ప్రకారం ఎల్‌ఎల్‌ఆర్ పరీక్షలో ఉత్తీర్ణులై, అధికారుల ముందు వాహనాలు నడిపి లైసెన్స్ పొందవచ్చు.

– సత్యనారాయణరెడ్డి, ఆర్టీఓ, ఆత్మకూరు

నందికొట్కూరు: జిల్లాలో తల్లిదండ్రులు ప్రేమతో కుమారులకు లక్షలాది రూపాయల విలువ చేసే ద్విచక్ర వాహనాలను కొనిస్తున్నారు. విచ్చలవిడిగా, ఇష్టానుసారంగా తిరుగుతూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో అతడితోపాటు తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేయాల్సి వచ్చింది. డ్రైవింగ్ లైసెన్సే...కదా తీసుకుందాములే..! అనుకుంటే ఇబ్బందికర పరిస్థితులే. వయస్సు పరిమితి దాటి కూడా లైసెన్స్ పొందలేదంటే, అది కచ్చితంగా మన తప్పే. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా రోడ్డు పైకి వస్తే, అనుకొని ప్రమాదం జరిగితే ఫలితం దారుణంగా ఉంటుంది. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలి. వాహనదారులకు లైసెన్స్ ఎంతో మేలు చేస్తుంది.

సేవలు సులభతరం

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఎల్‌ఎల్‌ఆర్ అనుమతి పత్రాలు మంజూరు చేయడానికి గత ప్రభుత్వం రవాణా సేవల్ని సులభతరం చేసింది. గతంలో ప్రజల ముంగిట రవాణా శాఖ పేరుతో మేళా కార్యక్రమాలు కూడా నిర్వహించేవారు. రవాణా శాఖ అధికారులు ఏటా కళాశాలలకు వెళ్లి ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ ఆవశ్యకత గురించి వివరించి అనుమతులు ఇచ్చారు. ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు ఎల్‌ఎల్‌ఆర్ కోసం ఇంటి నుంచే దరఖాస్తులు చేసుకోవచ్చు. మీ సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు ఉంది. స్లాట్ ప్రకారం పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత అధికారుల ముందు వాహనాలు నడిపి అనుమతులు పొందవచ్చు.

కంప్యూటర్‌పై అవగాహన లేక అవస్థలు

డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అవసరమైన సూచికల పరీక్షలో కంప్యూటర్ వినియోగించడం మినహా మరో మార్గం లేదు. ఉత్తీర్ణత సాధించాలంటే మాక్ టెస్టు ద్వారా ముందస్తుగా సాధన చేయడం తప్పనిసరి. ఆత్మకూరు ఆర్టీఓ కార్యాలయంలో రోజుకు కనీసం 100 వరకు నెలకు మూడు నుంచి నాలుగు వేల వరకు డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. వీరిలో 90 శాతం మంది అక్షరాస్యత కలిగి ఉన్నప్పటికీ కంప్యూటర్ వినియోగించడంలో కనీస నైపుణ్యం లేని వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కంప్యూటర్‌పై అవగాహన ఉన్నవారే సూచికల పరీక్షలో బోల్తా పడుతున్నారు. ఇక ఏమాత్రం తెలియని వారి పరిస్థితి మరింత గందరగోళంగా మారి లైసెన్స్ తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. దీనిపై అధికారులు ముందుగా తర్ఫీదు పొంది రావాలని చెబుతున్నారు.

అరకొర డ్రైవింగ్‌తో రోడ్డెక్కితే ప్రమాదం

నేడు ప్రతి కుటుంబానికి రెండు లేదా మూడు వాహనాలు ఉంటున్నాయి. ఇంట్లోని పెద్దాచిన్నా తేడా లేకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మానవుల జీవితానికి తక్షణ అవసరంగా మారిన వాహనాలను నడపటానికి ముందు రహదారి నిబంధనలు తెలుసుకోవాలి. ఆ తర్వాత రవాణా శాఖ నుంచి లైసెన్స్ తీసుకుని రోడ్డుపై రావాలి. ఇవేవీ పట్టించుకోకుండా అరకొర డ్రైవింగ్ నేర్చుకుని రోడ్డు పైకి వచ్చేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల ఎదుటి వారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే నష్టాలు..

రక్షణాత్మక డ్రైవింగ్ తెలియక తమతో పాటు ఎదుటి వాహనదారులను మృత్యు కోరల్లోకి తీసుకెళ్తారు. మృతులకు ప్రభుత్వం అందించే ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు అందదు. ప్రమాదంలో మరణించినవారికి ఇచ్చే రెట్టింపు ఇన్స్యూరెన్స్ రాదు. గాయపడిన వారికి మెరుగైన ఉచిత వైద్య చికిత్సలు అందవు. ప్రాణాలతో బయటపడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు. రహదారుల నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన ఉండదు. మలుపుల వద్ద, వేగ నియంత్రికలు(స్పీడ్ బ్రేకర్లు) వద్ద రక్షణాత్మక డ్రైవింగ్ చేయలేరు.

లైసెన్స్ పొందేందుకు అర్హతలు..

గేర్లు లేని 50 సీసీలోపు ఇంజిన్ ఉన్న ద్విచక్ర వాహనాన్ని నడపటానికి 16 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. తల్లిదండ్రుల సంరక్షకుల అనుమతి పత్రం తప్పనిసరి. గేర్లు లేని 50 సీసీ మించిన ద్విచక్ర వాహనం నడపాలంటే 18 ఏళ్లు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. కారు, జీపు నడపటానికి 19 ఏళ్ల వయస్సు ఉండి లైసెన్స్ తీసుకోవాలి. లారీ, బస్సులు, ట్యాక్సీలు నడపటానికి 20 ఏళ్లు నిండటంతో పాటు హెవీ వెహికల్ లైసెన్స్‌తో పాటు ఏడాది అనుభవం ఉండాలి.

గాలికుంటును తరిమికొడదాం..

- నేటి నుంచి 15 రోజుల పాటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం

బండి ఆత్మకూరు : పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాడి అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో పశువులు మేతకు పచ్చిక బయళ్లకు వెళ్లి, నీటితో నిండిన ప్రదేశాల్లో తిరిగి గాయపడితే, ఆ గాయం ద్వారా బ్యాక్టీరియా పశువుల శరీరంలోకి ప్రవేశించి గాలికుంటు వ్యాధి వ్యాపిస్తుంది. అలాగే ఎద్దులు, గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి (ఫుట్ అండ్ మౌత్ డిసీజ్) సోకే ప్రమాదం ఉంది. దీని బారిన పడిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.సరైన విధానాలు పాటిస్తే పశువులు, జీవాలను కాపాడుకోవచ్చని పశువైద్యులు పేర్కొంటున్నారు.మండల వ్యాప్తంగా నేటి నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు.

మండలంలో ఇలా..

మండల వ్యాప్తంగా 28 వేల పశువులు ఉన్నాయి. వీటికి 7వ రౌండ్ బూస్టర్ డోస్‌గా నేటి నుంచి వచ్చే నెల 15 వ తేదీ వరకు గాలికుంటు నివారణ ఉచితంగా వేయనున్నారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఏడాది లోపు దూడలకు బూస్టర్ డోస్ వేయనున్నారు.

వ్యాధి లక్షణాలు..

- గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఎక్కువ. వ్యాధి సోకిన సమయంలో పశువుల్లో గర్భం విఫలమవుతుంది. వేడిని తట్టుకోలేవు.
- ఈ వ్యాధికి గురైన గేదె, మేక, గొర్రె వంటి జీవాలకు తీవ్రమైన జ్వరం వస్తుంది. పాల దిగుబడి తగ్గడం, నోరు, మూతి, కాళ్లు, పొదుగు మీద పుండ్లు, బొబ్బలు వస్తాయి. కాళ్లు కుంటడం, నోటి నుంచి నురగ కారుతుంది.
- ఆగస్టు, సెప్టెంబర్, మార్చి, ఏప్రిల్ మాసాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. దీని వల్ల మరణాల శాతం తక్కువైనప్పటికీ పశువుల్లో ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల ఫారన్ హీట్ వరకు పెరిగిన పశువులు నీరసిస్తాయి.
- నోటి ఎపిథీలియం (పైపొర), పళ్లు, చిగుళ్లు, నాలుక, ముట్టి లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడతాయి. అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులు నొప్పితో మేత తినవు. శ్వాసను కష్టంగా పీల్చుతూ, రొప్పుతుంటాయి.



పశువులకు టీకా వేస్తున్న వైద్యురాలు

ఇలా వ్యాపిస్తుంది..

వ్యాధికి గురైన పశువుల లాలాజలం, పుండ్ల నుంచి కారే రసి వల్ల మిగతా పశువులకు వ్యాపిస్తుంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్న ప్పుడు దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సంకరజాతి పశువులు త్వరగా ఈ వ్యాధి బారిన పడతాయి.

నివారణ..

పశువులు బాగా బలహీనంగా ఉంటే రక్తంలోకి గ్లూకోజ్‌ఇవ్వాల్సి ఉంటుంది. నోటిలో పుండ్లతో మేత మేయవు కనుక వాటికి సులభంగా జీర్ణమయ్యే పోషక పదార్థాలతో కూడిన ఆహారంఅందించాలి. జావ, జొన్న, అన్నం, బెల్లంతో కలిపి ప్రతిరోజూ తాగించడం ద్వారా బలహీన పడకుండా జాగ్రత్త వహించాలి. ఈ వ్యాధి సోకిన పశువులను వేరు చేయాలి. వాటి మలమూత్రాలను గడ్డిలో కాల్చివేయాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. ఆబోతులు, దున్నల వీర్యం ద్వారా కూడా వ్యాపిస్తుంది. గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి నిమ్ లెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ రాయాలి.

టీకాలు తప్పనిసరి

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువైద్యశాఖ ద్వారా ఈ నెల 15 నుంచి అక్టో బర్ 15 వరకూ జిల్లాలో ఉచితంగా వేయనున్నారు. వీటిని పశువులు, జీవాలకు వేయించాలి. వ్యాధి నివారణ చర్యలు చేపడితే పశు సంపద ఆరోగ్యంగా ఉంటుంది.

– అనూష, పశువైద్యాధికారిణి, బండిఆత్మకూరు

కబడ్డీ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు బాల బాలికల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 250 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. వీరిలో 20 మంది బాలురను, 20 మంది బాలికలను కోచింగ్ క్యాంప్‌కు ఎంపిక చేసినట్లు నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల మోహన్‌రావు యాదవ్ తెలిపారు. వీరు జిల్లా, అంతర్జాతీయ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కబడ్డీ సెక్రటరీ సుబ్రమణ్యం, క్రీడా అసోసియేషన్ నాయకులు రామేశ్వరరెడ్డి, ఇప్పా వెంకటేశ్వర్లు, హరికృష్ణ, మమత, రేవతి, తదితరులు పాల్గొన్నారు. హాజరైన క్రీడాకారులందరికీ గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి భోజన వసతి ఏర్పాటు చేశారు.

ఆత్మకూరులో కార్డెన్ సెర్చ్



సీజ్ చేసిన మోటార్ సైకిళ్లను చూపుతున్న సీఐ

ఆత్మకూరు: స్థానిక ఏకలవ్యనగర్ కాలనీలో సీఐ రాము ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించగా ఎలాంటి రికార్డులు లేని 35 మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

వేంపెంటలో కార్డెన్‌సర్చ్

పాములపాడు: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నివారంచడమే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని వేంపెంట గ్రామంలో కొత్తపల్లి ఎస్‌ఐ జయశేఖర్, పోలీసు సిబ్బందితో గ్రామంలో తెల్లవారు జాము నుంచి అనుమానితులు, నేర చరిత్ర కలిగిన వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అక్రమ మద్యం కలిగి ఉన్న శంకర్ నాయక్ ఇంట్లో 15 క్వార్ బాటిళ్లు, సరైన ధ్రవపత్రాల్లేని 8 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, ఆవేశంతో అనాలోచితంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

మెలకువలే కీలకం

- పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి



పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

బండిఆత్మకూరు: పంటల సాగులో భాగంగా రైతులు తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకునేందుకు వివిధ రకాల రసాయన పురుగు మందులు వినియోగిస్తారు. అయితే కనీస జాగ్రత్తలు చేపట్టకుండా మందులు పిచికారీ చేస్తే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం వాటిల్లే అవకాశముంది. కావున అధికారుల సూచనలు పాటించి మందులు పిచికారీ చేస్తే పైరుతో పాటు రైతన్న కూడా క్షేమంగా ఉంటారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా మండలంలోని కాకనూరు గ్రామంలో జూలైలో పొలంలో గుళికలు చల్లాడానికి వెళ్లి ఓ రైతు వాటి విష ప్రభావంతో అస్వస్థతకు గురి కావడంతో వెంటనే 108లో బండి ఆత్మకూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో 59 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది.

సూచనలు పాటించాలి..

ప్రస్తుత సార్వా సీజన్‌లో వరి సాగు కుదుళ్ల దశలో ఉంది. ఇలాంటి సమయంలో వినియోగించే పురుగు మందుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఎరువుల దుకాణాల్లో మాత్రమే మందులు కొనుగోలు చేయాలి. పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో పురుగుల మందుల స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరిత మందులైతే నీలం, తక్కువ విషపూరితమైతే ఆకు పచ్చ రంగు గుర్తులు ఉంటాయి. వ్యవసాయ అధికారులు సూచించిన మందులను మాత్రమే పొలాలకు వినియోగించాలి. పంటలకు చీడపీడలు ఆశిస్తే అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వారి సూచనల మేరకు పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..

- పురుగుమందుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వాటి పిచికారీ విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలి.
- పురుగు మందులతో కలిపి ఆహార పదార్థాలను తీసుకువెళ్లకూడదు. ఇంట్లో మందులు నిల్వ ఉంచినప్పుడు ఆ గదికి తాళం వేయాలి. వాటిని చిన్న పిల్లలకు అందకుండా చాడాలి.
- మందులను పిచికారీ చేసేటప్పుడు తలకు, శరీరానికి రక్షణగా దుస్తులు, మాస్కులు ధరించాలి.
- ముందు డబ్బాలను ఆహార పదార్థాలు, తాగు నీటిని నిల్వ చేసేందుకు వాడకూడదు.
- వరిచేలలో మందును గాలి వీచే దిశలో పిచికారీ చేయాలి. పిచికారీ చేసే సమయాల్లో ఆహారం తిన కూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు.
- స్ప్రే నాజిల్‌ను శుభ్రపరిచేందుకు నోటితో ఊదకూడదు. అనుకోకుండా శరీరం, దుస్తులపై మందు పడితే వెంటనే శుభ్రం చేసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మందులు పిచికారీ చేయాలి.
- ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే వెంటనే చికిత్స పొందాలి.
- వాడేసిన ఖాళీ డబ్బాలను భూమిలో పాతి పెట్టాలి.

సలహాలు పాటించాలి

వరి పొలాల్లో చీడపీల నియంత్రణకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించాలి. నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను మాత్రమే వాడుకోవాలి. మందును పిచికారీ చేసే సమయాల్లో సూచించిన జాగ్రత్తలు తీసుకోవాలి. పిచికారీ చేసిన చేతులతో నీరు తాగడం, ఆహారం తీసుకోరాదు.

– పవన్‌కుమార్, ఏఓ, బండిఆత్మకూరు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మలు ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి సమస్యలపైఅర్జీలు ఇవ్వాలని సూచించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.